క్లుప్తంగా

హోంగార్డు శంకర్‌కు పురస్కారం



కలెక్టర్, సీపీ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న శంకర్

కారేపల్లి: కారేపల్లి పోలీసుస్టేషన్ హోంగార్డు భూక్యా శంకర్‌కు పురస్కారం లభించింది. చీమలపాడు ఘటనలో ప్రాణాలకు తెగించి మంటలు ఆర్పడమే కాక క్షతగాత్రులను వాహనాల్లో ఖమ్మం తరలించటంలో కీలకంగా వ్యవహరించిన ఆయన అవార్డుకు ఎంపిక కాగా కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్ సన్మానించారు. కాగా, శంకర్‌ను సింగరేణి సీఐ నూనె వెంకటేశ్వర్లు, ఎస్ఐ పుష్పాల రామారావు అభినందించారు.

మధిర మార్కెట్ చైర్మన్‌గా శ్రీనివాసరావు



శ్రీనివాసరావు

బోనకల్: మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని నియమించారు. ఈమేరకు చైర్మన్‌గా బందం శ్రీనివాసరావును నియమిస్తూ మార్కెటింగ్ శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. బోనకల్ మండలం ముష్టికుంట్లకు చెందిన శ్రీనివాసరావు గతంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా మూడు పర్యాయాలు పనిచేశారు. ఇక వైస్ చైర్మన్‌గా మధిర మండలం మర్లపాడుకు చెందిన కటికాల వెంకట సత్యనారాయణరెడ్డితో పాటు 16 మంది డైరెక్టర్లను నియమించారు. మార్కెట్ చైర్మన్ పదవి తొలిసారిగా బోనకల్ మండలానికి దక్కడంపైపలువురు హర్షం వ్యక్తం చేశారు.

జీలుగు విత్తనాలు పంపిణీ



జీలుగు విత్తనాలు పంపిణీ చేస్తున్న సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి

ఎర్రుపాలెం: మండలంలోని రాజుపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సోమవారం స్థానిక సొసైటీ చైర్మన్ వెన్నపూస కృష్ణారెడ్డి, సొసైటీ సీఈఓ బొగ్గుల శివారెడ్డిలు పలువురు రైతులకు సబ్సిడీ ధరపై జీలుగు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం సబ్సిడీ ధరపై ఇస్తున్న జీలుగు విత్తనాలను రైతులు సకాలంలో తీసుకెళ్లి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు బొగ్గుల లక్ష్మి, బూసిపల్లి వెంకటరెడ్డి, ఎంపీటీసీ దోమందుల సామేలు, సొసైటీ సిబ్బంది కుంపటి శ్రీనివాసరావు, కన్నయ్య తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పు చేయించుకోవాలి



గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

ఏన్కూరు: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే గర్భిణులు కాన్పులు చేయించుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఎన్.దయామణి కోరారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా స్థానిక రైతువేదికలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణీ స్త్రీలు క్రమం తప్పకుండ వైద్య పరీక్షలు చేయించుకోవాలని, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. స్థానిక శివాలయం కమిటీ ఆధ్వర్యంలో మహిళలకు చీరలు, గాజులు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బుజ్జి, ఎంపీటీసీ కృష్ణవేణి, ప్రభుత్వ వైద్యాధికారి రాములు, శివాలయం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

తల్లాడ: ఈ నెల 7న తహసీల్ వద్ద ప్రజల సమస్యలపై ధార్నా నిర్వహిస్తున్నట్లు సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకులు ఎస్.కె.లాల్‌మియా తెలిపారు. తల్లాడ, అన్నారుగూడెం గ్రామాల్లో సోమవారం సీపీఐ ఎంఎల్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లాల్‌మియా మాట్లాడుతూ.. పోడు భూములకు పట్టాలివ్వాలని, కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని, 57 సంవత్సరాలు నిండిన వారందరికీ పెన్షన్లు అందించాలని కోరుతూ ఈ ధర్నా చేపట్టడం జరిగిందన్నారు. ప్రజలు ఈ ధర్నాను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మండల కార్యదర్శి కొండ వెంకటేశ్వర్లు, ఎస్.కె.జాని, వాలియా, రావేలు, మరియమ్మ, పుల్లమ్మ పాల్గొన్నారు.

పరిమళిస్తున్న మానవత్వం

- ప్రతిరోజు అన్నదానం
- దానం కంటే దాతృత్వం గొప్పది
- మధిర ప్రాంత నిరుపేదల ఆకలి తీరుస్తున్న దాతలు



శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం చేస్తున్న దాతలు (ఫైల్)

మధిర: మధిర పట్టణంలోని నిరుపేదలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చే పేద వారికి సమయానికి భోజనం పెట్టి వారి ఆకలిని తీరుస్తున్నారు. మానవత్వం పరిమళించే మంచి మనసుకు స్వాగతం.. అంటూ ప్రతిరోజు ఏదో ఒక ఆలయంలో లేక చర్చిలో అన్నదాన కార్యక్రమాలు జరుగుతున్నాయి. అడిగితే చేసేది దానం, అడగకుండా ఇచ్చేది దాతృత్వం. దానం కంటే దాతృత్వం గొప్పది అనే సామెతను నిజం చేస్తున్నారు మధిర ప్రాంత ప్రజలు. వివిధ ఆలయాల్లో ప్రతిరోజు జరిగే అన్నదాన కార్యక్రమానికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరిస్తున్నారు. మధిర ప్రాంతంలోని దాతలు ఈ మహా ప్రసాదాన్ని కడు పేదలకు అందజేసి ఆదర్శంగా నిలుస్తున్నారు.

పలుచోట్ల అన్నదానాలు..

మధిర పట్టణంలోని వైరా నది ఒడ్డున వేంచేసి ఉన్న శ్రీ మృత్యుంజయ స్వామి ఆలయంలో ప్రతి సోమవారం దాతల సహకారంతో భక్తులకు, పేదలకు అన్నదానం చేస్తున్నారు.

- మంగళవారం పట్టణ సమీపంలోని ఆత్కూరు క్రాస్ రోడ్డులో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో అన్నదానం జరుగుతుంది.
- బుధవారం మధిర పట్టణంలోని మెయిన్ రోడ్‌లో ఉన్న శ్రీ విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.
- గురువారం శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో, శుక్రవారం వేణుగోపాల స్వామి ఆలయంలో అన్నదానం జరుగుతుంది.
- శనివారం వర్తక సంఘంలో ఉన్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి, వైరా రోడ్డులోని శ్రీ లక్ష్మి పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో అన్నదానం నిర్విఘ్నంగా కొనసాగుతుంది.
- ఆదివారం తెలుగు బాప్టిస్ట్ చర్చ్, సీఎస్ఐ తదితర ప్రార్థనా మందిరాల్లో అన్నదానం నిర్వహిస్తారు.

దానం కంటే.. దాతృత్వం గొప్పది..

వివిధ దుకాణాల్లో పనిచేసే నిరుపేద గుమస్తాలు, యాచకులు, అనాథలకు అన్నదానం చేసి మానవత్వాన్ని చాటుకుంటున్నారు. అదేవిధంగా నెలకు సగం రోజుల్లో మానసిక వికలాంగుల సేవాసదనములో, ఆర్కే ఫౌండేషన్ అనాథాశ్రమంలో, ఆదరణ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వివిధ ఫంక్షన్లలో మిగిలిపోయిన భోజనం, కూరలను వృద్ధాశ్రమం, అనాథాశ్రమాలకు పంపుతున్నారు. నేటి కంప్యూటర్ సమాజంలో బంధువులు, స్నేహితుల మధ్య ప్రేమ, ఆప్యాయతలు తగ్గిపోతున్నప్పటికీ పూజలు, దాన గుణాలు పెరిగాయి. పూర్వీకుల జ్ఞాపకార్థం, పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవ రోజు, రాజకీయ నాయకుల జయంతి, వర్ధంతి, ఉద్యోగం వచ్చిన వారు, వివిధ దేశాల్లో స్థిరపడిన వారు పలు కార్యక్రమాలతో పాటు వివిధ సందర్భాలను పురస్కరించుకొని అన్నదానం చేస్తున్నారు. అదేవిధంగా అయ్యప్ప స్వాముల మాలధారణ సమయంలో స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో, ఆర్వీ సిండికేట్ ఆధ్వర్యంలో సుమారు రెండు నెలల పాటు అన్నదానం చేస్తారు. వివిధ రకాల మాలధారణలు చేపట్టిన భక్తులకు అన్నదానం, చద్ది కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. కరోనా సమయంలో కూడా మధిరలో అనేకమంది దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భోజనం పార్సిల్ ప్యాకెట్లను కరోనా బాధిత కుటుంబాలకు అందజేశారు.

పదేళ్లుగా అన్నదానం..



శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయం వద్ద గత పది సంవత్సరాలుగా ప్రతీ బుధవారం దాతల సహకారంతో భక్తులకు, నిరుపేదలకు అన్నదానం చేస్తున్నాం. అదే విధంగా మరికొంతమంది జన్మదినం, జయంతి, వర్ధంతి తదితర శుభ, అశుభ కార్యాలను పురస్కరించుకొని అన్నదానం చేస్తుంటారు.

– కోనా జగదీష్, అన్నదాన కమిటీ నిర్వాహకులు

అన్నదానాలకు అడ్డాగా..



మధిర పట్టణంలోని వైరా నది ఒడ్డున వేంచేసి ఉన్న శ్రీ మృత్యుంజయ స్వామి ఆలయంలో ప్రతీ సోమవారం దాతల సహకారంతో అన్నదానం చేస్తున్నాం. అనేక మంది భక్తులు, యాచకులు, నిరుపేదలు వచ్చి ఆకలిని తీర్చుకుంటారు. ఎంతోమంది సేవా కార్యక్రమాలకు మధిర అడ్డాగా మారింది.

– వంకాయలపాటి నాగేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్

వరిసాగుపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ పవన్‌కుమార్

వైరారూరల్: మండలంలోని పూసలపాడు, సోమవరం, తాటిపూడి గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారులు ముందస్తు వరిసాగుపై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ పవన్‌కుమార్ మాట్లాడారు. యాసంగిలో అకాల వర్షాల వలన రైతులకు తీరని నష్టం వాటిల్లిన నేపథ్యంలో.. వానాకాలం సీజన్‌లో నెలరోజుల ముందు పంటలు వేసుకుంటే అకాల వర్షాలు, తుఫాన్ల నుంచి రైతులు తమ పంటలను కాపాడుకోవచ్చన్నారు. నీటి లభ్యత కోసం బోర్లు, వ్యవసాయ బావుల కింద జూన్ 10 లోపు వరి నాట్లు వేసుకోవాలని సూచించారు. అనంతరం ఆయా గ్రామాల్లో కూపన్లు రాసి పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పూసలపాడు సొసైటీ చైర్మన్ శ్రీనివాసరావు, ఏఈఓలు కీర్తి, వాసంతి, రాజేష్, రైతులు పాల్గొన్నారు.

ఏరువాక సాగారో..



దుక్కి దున్నుతున్న రైతు

కల్లూరు రూరల్: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఏరువాక ప్రారంభమైంది. ప్రతి సీజన్‌లో రైతులకు వ్యవసాయ పండుగలలో ఏరువాక శుద్ధ పౌర్ణమి రోజు అత్యంత ముఖ్యమైనది. రైతులు, వ్యవసాయ కూలీలు ఎంతో ఉత్సాహంగా ఒక పండుగలాగా జరుపుకుని వ్యవసాయ పనిముట్లకు పసుపు, కుంకుమ పూస్తారు. వర్ష రుతువు ఆరంభం సూచకంగా పొలాల్లో దుక్కులు దున్ని వ్యవసాయ పనులు ప్రారంభిస్తారు. ఎరువులు పొలాల్లో వేసిన అనంతరం వేసవిదుక్కులు దున్నుతారు. వర్షాలు ప్రారంభం కాక ముందే దుక్కులు దున్నే పనులు ముమ్మరంగా చేపడుతున్నారు.

ఆర్థిక సాయం..

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లకు చెందిన స్వాతంత్ర సమరయోధుడు ముత్యాల అసేనయ్య కుటుంబానికి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సాయం చేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. అసేనయ్య 10 ఏళ్ల క్రితం మృతి చెందడు. వారం క్రితం అసేనయ్య పెద్దకుమారుడు బుచ్చయ్య అనారోగ్యంతో మృతి చెందడు. వీరు నిరుపేదకుటుంబం కావడంతో ఆయన కర్మ కాండలు కూడా చేసే పరిస్థితి లేని విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న ఎంపీ వద్దిరాజు రూ.25 వేలను గాయత్రీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ మేనేజర్ బి.కిరణ్‌కుమార్, తనికెళ్ల మాజీ సర్పంచ్ గడల సీతారామయ్య, ఎస్టీయూ సంఘం నాయకులు లేడిబోయిన గోపాలరావు, ఆకుతోట మంగపతిరావుల చేతుల మీదుగా రూ.20 వేల నగదు, రూ.5 వేలు విలువైన బియ్యం అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టు సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ, స్థానిక నాయకులు యాసా వెంకటేశ్వరరావు, లేడిబోయిన నాగేశ్వరరావు, యాసా సత్యనారాయణ, పాపిట్ల ఏసు, పెద్దమళ్ల రత్తమయ్య, బండి లక్ష్మీనారాయణ, శ్రీను, పిన్నంపుల్లయ్య, తిరపతిరావు, నరసింహారావు, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ యూనియన్ ఆధ్వర్యంలో..

కల్లూరు: కల్లూరు మండల ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. కల్లూరు పట్టణానికి చెందిన చింతపల్లి సాయితేజ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా, ఆ కుటుంబానికి రూ.32 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షుడు జూపుడి జయరాజు, కార్యదర్శులు వలసాల సురేష్, ధర్నాసి కర్ణ, జిల్లా యూనియన్ మాజీ అధ్యక్షులు ధర్నాసి బాలరాజు, సభ్యులు ఇల్లూరి రవి, చింతపల్లి రామకృష్ణ, రామడుగు హరి, గౌరవ సలహాదారులు కమల్‌షా, పథకముడి నరసింహాచారి, గార్లపాటి లక్ష్మణ్, నందిగామ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాద మృతులకు నివాళి

వేంసూరు: ఒడిశాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మృతి చెందిన వారికి కురుమ యూత్ ఆధ్వర్యంలో అశ్రునివాళి అర్పించారు. మండలంలోని మర్లపాడు కురుమ యూత్ సభ్యులు ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ప్రమాదంలో మరణించిన వారికి సంతాపం తెలిపారు.

కంటి వెలుగు వైద్య శిబిరం



ఎర్రుపాలెంలో కంటి పరీక్ష చేస్తున్న వైద్యాధికారి

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం కంటి వెలుగు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 153 మందికి కంటి పరీక్షలను వైద్యుడు రవిరాజ్ నిర్వహించారు. దృష్టిలోపం ఉన్న 14 మందికి కళ్ల అద్దాలను అందించారు. మరో 9 మందికి కళ్ల అద్దాలు ఇచ్చేందుకు ఆర్డర్ పెట్టారు. ఒకరిని సర్జరీకి రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ వెంకటేశ్వరరెడ్డి, ఏఎన్ఎం స్నేహ, డేటా ఎంట్రీ ఆపరేటర్ గోపాలకృష్ణ, ఆశా కార్యకర్తలు విజయ, రమణ, కోటమ్మ, ముత్యాలు తదితరులు ఉన్నారు.

లింగన్నపాలెంలో..

వైరారూరల్: మండలంలోని లింగన్నపాలెం గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన రెండో విడత కంటి వైద్య శిబిరాన్ని జెడ్పీకోఆప్షన్ సభ్యుడు షేక్.లాల్ మహ్మద్, సర్పంచ్ అనితతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించండి

కల్లూరురూరల్: మండలంలోని రావికంపాడు నుంచి వెన్నవెల్లికి రోడ్డు నిర్మించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. 1998 సంవత్సరంలో రావికంపాడు – వెన్నవెల్లి రహదారిని తాత్కలికంగా నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు గత 23 సంవత్సరాలుగా ఈ రోడ్డుకు ఎటువంటి మరమ్మతులు చేపట్టలేదు. ఆనాడు మట్టి (గ్రావెల్) తో నిర్మించిన ఈరోడ్డు రవాణాకు అనువుగా లేదు. ఈ రోడ్డు నిర్మించినట్లయితే చెన్నూరు, రావికంపాడు, ఎర్రబోయినపల్లి, వెన్నవెల్లి గ్రామాల ప్రజలకు, ఆయకట్టు భూముల రైతులకు ఉపయోగపడుతుంది. కావున ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ రోడ్డును నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

దరఖాస్తు చేసుకోండి

కారేపల్లి: కారేపల్లిలోని ఎస్ఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల భవన సముదాయంలో నిర్వహిస్తున్న వైరా మైనార్టీ బాలికల గురుకులంలో ఖాళీగా ఉన్న అవుట్ సోర్స్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శైలజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక పీజీటీ సోషల్, ఒక పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, పీజీటీ సోషల్ పోస్టుకు బీఎడ్, పీజీ చేసిన వారు అర్హులని, అదే విధంగా పీఈటీ పోస్టుకు బీపీఈడీ అర్హత ఉన్న మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 10 లోపు దరఖాస్తులను కారేపల్లిలోని మైనార్టీ గురుకులంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 79950 57902 ఫోన్ నంబర్‌ను సంప్రదించగలని తెలిపారు.

తీరు మార్చుకోవాలి..

వేంసూరు: మిషన్ భగీరథ అధికారులు తీరు మార్చుకోవాలని మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అన్నారు. మండలంలోని పలు పంచాయతీల్లోని భగీరథ ట్యాంకులకు నీరు సరఫరా చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు తమతమ శాఖల ప్రగతి నివేదికలను సమావేశంలో వివరించారు. అనంతరం మిషన్ భగీరథ అధికారుల పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీరు అందక ప్రజలు పడుతున్న ఇబ్బందులను కలెక్టర్ దష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం సత్తుపల్లి బస్సు స్టేషన్ మేనేజర్‌గా పని చేస్తున్న శ్రీనివాస్ పదవి విరమణ జూన్ నెలలో ఉండటంతో అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయనను శాలువ, పూలమాలలతో సన్మానించారు.

నేత్రదానం సర్టిఫికెట్ అందజేత

పెనుబల్లి: మండలంలోని గంగదేవిపాడు గ్రామానికి చెందిన మాజీ గిరిజన సొసైటీ అధ్యక్షుడు కాకా వెంకటేశ్వర్లు సతీమణి రాధమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆమె నేత్రాలను అభయాలయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఖమ్మం నేత్ర నిధికి అందించారు. సోమవారం రాధమ్మ దశదిన ఖర్మ సందర్భంగా ఖమ్మం నేత్రనిధి నిర్వాహకులు పద్మనాభం, టెక్నీషియన్స్, అభయాలయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నరసింహారావు, డిస్ట్రిక్ట్ చైర్మన్ లక్ష్మీనారాయణలు రాధమ్మ కుటుంబ సభ్యులను అభినందించి సర్టిఫికెట్, మెమెంటోలను అందజేశారు. అనంతరం నేత్రదానంపై అవగాహన కల్పించారు.

విద్యుత్ వినియోగంలో తెలంగాణ టాప్



వైరా: జూట్ బ్యాగులు అందజేస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్, మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, అదనపు కలెక్టర్ స్నేహలత



మధిర: జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వైరా: విద్యుత్ వినియోగంలో తెలంగాణ యావత్ భారతదేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ అన్నారు. తెలంగాణ దశాబ్ది అవతరణ ఉత్సవాల్లో భాగంగా సోమవారం వైరాలో విద్యుత్ విజయోత్సవ సభ నిర్వహించారు. ప్రగతి సంబరాలను ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో వేల కోట్ల ఖర్చుతో విద్యుత్ ఉత్పత్తి పెంపుదలకు కృషి చేశారన్నారు. రాష్ట్రంలో విద్యుత్‌కు కొరత లేకుండా పోయిందన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఈ పథకాలను దేశవ్యాప్తంగా అమలు చేయాలని సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీని ప్రారంభించారన్నారు. తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి అధికంగా ఉన్నందున ఇతర దేశాల పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పరిశ్రమలు పెట్టడానికి ముందుకు వస్తున్నారన్నారు. వ్యవసాయానికి, గృహాలకు కోతలు లేని విద్యుత్‌ను అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో ఎన్ని అవంతరాలు వచ్చినా 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నారన్నారు. ఈ సభలో మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి, అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈ రామారావు ఏడీఈలు శ్రీనివాస్, తిలక్, వైరా, పెద్దగోపతి సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ మండలాల ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ విజయోత్సవ వేడుకలు..

మధిర: మధిరలోని రెడ్డి గార్డెన్స్‌లో నియోజకవర్గ స్థాయి విద్యుత్ శాఖ విజయోత్సవ వేడుకలను సోమవారం నిర్వహించారు. ముందుగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర ప్రగతిని తెలియజేస్తూ వీడియోలను ప్రదర్శించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కోటేశ్వరరావు, ఖమ్మం సర్కిల్ విద్యుత్ డీఏటీ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



మధిర: కోర్టులో మొక్క నాటుతున్న జడ్జి కార్తీక్ రెడ్డి, తదితరులు



సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి అర్బన్‌పార్కులో రేంజర్ వెంకటేశ్వర్లు, ఉద్యోగులు



తల్లాడ: మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఫారెస్ట్ సిబ్బంది

మధిర: పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలని మధిర కోర్టు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కార్తీక్ రెడ్డి తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుని కోర్టు ఆవరణలో సోమవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లారావు, సీనియర్ న్యాయవాదులు వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కోటేశ్వరరావు, వెంకట్రావు, రమేష్, శ్రీనివాసరావు, రవి, మోహన్‌దాసు పాల్గొన్నారు.

సత్తుపల్లిటౌన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సత్తుపల్లి రేంజర్ ఎ.వెంకటేశ్వర్లు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సత్తుపల్లి అటవీశాఖ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించి స్థానిక అర్బన్‌పార్కులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి రాధిక, డీఆర్‌ఓలు ముత్యాలరావు, నాగూర్‌బి, ఎఫ్ఎస్ఓలు నర్సింహా, మంగారావు, మధన్, బీట్ ఆఫీసర్లు వెంకటేశ్వర్లు, కృష్ణ, ప్రసాదలింగం, వెంకటరమణ, పద్మ, కోటేశ్వరి, సుధాకర్ పాల్గొన్నారు.

జేవీఆర్ కళాశాలలో..

స్థానిక జేవీఆర్‌ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎకోక్లబ్, లైఫ్ సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.రామచంద్రరావు కె.విజయ్‌కుమార్, ఎం.రాంబాబు, బంగారి, మధు, శ్రీనివాస్, మాధవి, రవికుమార్ పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో స్థానిక సర్పంచ్ అప్పారావు, సెక్రటరీ నాగేశ్వరరావు, ఈజీఎస్ టీఏ విజయలక్ష్మిలు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం హరితహారం కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు.

మోటార్ సైకిళ్లతో ర్యాలీ..

తల్లాడ: తల్లాడ అటవీ క్షేత్ర సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ తల్లాడ ఫారెస్ట్ కార్యాలయం నుంచి పెనుబల్లి మండలం పులిగుండాల ప్రాజెక్ట్ వరకు కొనసాగింది. పులిగుండాల ప్రాజెక్ట్ వద్ద ప్లాస్టిక్‌ను బస్తాల్లో మూటలు కట్టి బయటకు పంపించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఎఫ్‌డీఓ వి.మంజుల మాట్లాడుతూ.. అడవులను కాపాడి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తల్లాడ ఫారెస్ట్ రేంజర్ అరవింద్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు పెంచడం సామాజిక బాధ్యత..

ఏన్కూరు: మొక్కలు పెంచడం సామాజిక బాధ్యత అని వన ప్రేమికుడు కొంటు సాంబయ్య అన్నారు. మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో సోమవారం మొక్కలు నాటారు.

కాకతీయ షుగర్స్‌లో..

కల్లూరు: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కల్లూరు కాకతీయ షుగర్ ఫ్యాక్టరీ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ సీహెచ్ నాగేశ్వరరావు, ఫ్యాక్టరీ సివిల్ మేనేజర్ కొడాలి రఘునాథబాబు, చీఫ్ ఇంజనీర్ రామకృష్ణ, కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



వైరారూరల్: గన్నవరంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

బోనకల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యను అందించటం జరుగుతుందని ఎస్ఎంసీ చైర్మన్ కందుల పాపారావు అన్నారు. మండలంలోని ఆళ్లపాడు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులతో కలసి బడిబాట కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల నమోదు కోసం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం అమలవుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రవి, ఉపాధ్యాయులు రామ్మోహన్, రవికుమార్, దుర్గారావు పాల్గొన్నారు.

వైరారూరల్: మండలంలోని గరికపాడు, గన్నవరం జెడ్పీహెచ్‌ల ఆధ్వర్యంలో అలాగే ఖానాపురం యూపీఎస్, గోవిందపురం ప్రాథమిక పాఠశాలల ఆధ్వర్యంలో సోమవారం ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ఇంటింటికి తిరిగి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్ఎంలు చావా శ్రీనివాసరావు, కూరకుల సైదయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కందుకూరులో..

వేంసూరు: మండలంలోని కందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు.

చింతకాని: విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాల్లో ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్‌లు సుజాత, సునీత, ఎంపీటీసీ హేమ, ఎంఈఓ శ్యాంసన్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మొద్దు..

ఎర్రుపాలెం: బీఆర్ఎస్ నాయకుల మోసపూరిత మాటలను ప్రజలు నమ్మొద్దని పీసీసీ మెంబర్ శీలం ప్రతాపరెడ్డి, మండల కమిటీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి మండల కేంద్రంలో హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కరపత్రాలతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నేటికి నెరవేర్చలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజల మద్దతుతో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారావు, శ్రీనివాసరావు, వెంకటనర్సయ్య, బాబురావు, రాజేష్, వెంకటరత్నం, బోసు, ప్రసాద్, రామిరెడ్డి, ఏడుకొండలు, నాగబాబు తదితరులు ఉన్నారు.